క్లుప్తంగా

ముగిసిన భాగవత సప్తాహం'



ప్రవచనం చేస్తున్న వద్దపర్తి పద్మాకర్

గుంతకల్లు: స్థానిక కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో వారం రోజులు నిర్వహిస్తున్న భాగవత సప్తాహం ప్రవచన కార్యక్రమం ఆదివారం ముగిసినట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరి కృపాకర్ తెలిపారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ వద్దపర్తి పద్మాకర్ నేతృత్వంలో 387వ మద్భావగత సప్తాహం ప్రవచన కార్యక్రమం పూర్తయిందన్నారు. చివరి రోజు వాసవీ మాతకు ప్రత్యేక పూజల అనంతరం ధధి మంధనం కార్యక్రమంలో భాగంగా కొత్త కుండలో ఉన్న పెరుగు చిలికి ఆపై కుండను భిన్నం ద్వారా లభించే పెరుగును భక్తులకు ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మేడం వెంకటేశ్వర్లు, పరుచూరి సత్రంగయ్య, జయంతి వెంకట్, గుండావిజ్జి, పేరకం సురేష్, సాయి, ఇనుగురు సబ్బయ్య, పువ్వాడి శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన సేవ్ ఆర్డీటీ దీక్ష

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం చేపట్టిన వంద గంటల రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు రాజ్‌కుమార్, వెంకటరాముడు, రంగనాయకులు, కేశవ, నాగభూషణం, ఓబుళపతి, నాగశేఖర్ తదితరులు రిలే దీక్షలో కూర్చొన్నారు.

అధికారికి సన్మానం



మధుసూదన్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ఇటీవల పదవీ విరమణ పొందిన పారా మెడికల్ ఆప్తాలిక్ ఆఫీసర్ గాదిరాజు మధుసూదన్‌రాజు, డాక్టర్ సునీత దంపతులను ఆదివారం మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న ముస్లిం షాదీఖానాలో ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పరమేశ్వర, తాడిపత్రి మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, బంధువులు, స్నేహితులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుత్తి డాక్టర్ ప్రవీణ్ కుమార్, యాడికి ఆస్పత్రి సూపర్‌వైజర్ రాం ప్రసాద్ గౌడ్, వైద్యసిబ్బంది , టీచర్లు, నబీరసూల్ , జయచంద్రారెడ్డి, బుడ్డా జయప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి 'శ్రావణ' పూజలు



కరపత్రాలను విడుదల చేస్తున్న కుమార పండితారాధ్య స్వామీజీ

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని శ్రీశైల జగద్గురు మఠంలో ఈ నెల 25 నుంచి ఆగస్టు 23 వరకూ శ్రావణమాస పూజల్లో భాగంగా రోజూ మహారుద్రాభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు కుమార పండితారాధ్య స్వామి తెలిపారు. ఆదివారం మఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రావణమాస పూజలకు సంబంధించిన కరపత్రాలను స్వామీజీ విడుదల చేశారు. వీరశైవాగమ శాస్త్ర ప్రకారం శ్రావణ మాసమంతా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మహారుద్రాభిషేకం, బిల్వార్చన, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మఠం అభివృద్ధి మండలి సభ్యులు జి.పి.తిమ్మారెడ్డి, జి.పి. మంతకల్లురెడ్డి, బండారు రమేష్, దేవేంద్రప్ప, సురేష్‌గౌడ్, మోహన్‌బాబు, వీరన్నగౌడ్, మఠం మేనేజర్ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలి

గుత్తి: గుత్తిలో ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. తరుచూ పెచ్చులూడి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. నూతన బస్టాండ్‌ను నిర్మించాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీర భద్ర స్వామి , మండల కార్యదర్శి రామదాసు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాజు, సీనియర్ నాయకులు మహముదా, రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో తాగునీటికి కటకట

- వారం రోజులైనా మరమ్మతులకు నోచుకోని మోటార్
- నీళ్లు కొంటూ దాహార్తి తీర్చుకుంటున్న గ్రామస్తులు



పీ కొత్తపల్లిలో నిరుపయోగంగా ఓహెచ్‌ఆర్ ట్యాంకు



17వ వార్డులో వృథాగా ఉన్న స్పాట్ డెలివరీ ట్యాంకు



పామిడి: తాగునీటి సమస్యలతో గ్రామీణులు అవస్థలు పడుతున్నారు. పామిడి పంచాయతీలో పీ కొత్తపల్లి, పీ కొండాపురం మజారా గ్రామాలు. పామిడి 17వ వార్డులోని వడ్డేవీధిలో స్పాట్ డెలివరీ ట్యాంకు ఆవీధికి దిష్టిబొమ్మగా మారింది. రెండు నెలలుగా విద్యుత్ బోర్ మోటార్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆ ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీంతో ఆవీధి వాసులకు నీటికష్టాలు తప్పట్లేదు. ఇది ఇలా ఉంటే పీ కొత్తపల్లిలో వారం రోజులుగా తాగునీటికి కటకటలాడిల్సి వస్తోంది. ఈ గ్రామంలో మొత్తం 250 ఇళ్లు, 1000 మంది జనాభా, 750 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామానికి తాగునీటి సరఫరా చేసే మోటారు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. తాగునీటిని కొనాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇక కాలకృత్యాలు, స్నానాలకు నీరులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే దాహార్తి తీర్చేవారు లేకపోవడంతో మూగజీవాలు పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

దిష్టిబొమ్మగా ఓహెచ్‌ఆర్ ట్యాంకు

పామిడి సమీపంలోని పెన్నానదిలో మోటార్ నుంచి పైప్‌లైన్ ద్వారా ఓహెచ్‌ఆర్‌కు తాగునీరు సరఫరా అయ్యేది. వారం రోజులుగా గ్రామానికి తాగునీరు సరఫరా చేసే మోటారు చెడిపోయింది. అప్పటి నుంచి ఆ మోటారు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో నీటి సమస్య నెలకొంది. అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

తాగునీటి కోసం తల్లడిల్లుతున్నాం



తాగునీటి కోసం తల్లడిల్లుతున్నాం. వారం రోజులుగా గ్రామానికి తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామానికి సరఫరా చేసే విద్యుత్ బోర్ మోటారు చెడిపోయింది. మోటర్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామానికి నీటి సరఫరా కట్ అయ్యింది. దీంతో తాగునీరు లేక తల్లుడిల్లుతున్నాం. పశువుల పరిస్థితి దారుణంగా ఉంది

–ఎం.హెచ్. రాములమ్మ, పీ కొత్తపల్లి

నీళ్లు కొంటున్నాం



గ్రామానికి నీళ్ల సరఫరా చేసే మోటారు చెడిపోయింది. వారం రోజులైన మోటారు మరమ్మతులకు నోచుకోలేదు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో తాగునీటిని కొనాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మోటార్ మరమ్మతులకు నోచుకునేవరకూ ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలి.

–ఎం.చిన్న ఓబుళమ్మ, పీ కొత్తపల్లి

'కూటమి'పై ప్రజలు తిరగబడే రోజులొచ్చాయి



కొనుదల రమేష్‌రెడ్డి



ఫయాజ్ బాషా



చుక్కలూరు దిలీప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్/పామిడి: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యంగం అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులపై దారుణంగా రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనిదల రమేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌బాషా మండిపడ్డారు. కేవలం రాజకీయ కక్షతోనే వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసారని వారు ఆదివారం వారి స్వగృహాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్సన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. చంద్రబాబు తీరు, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు గమనిస్తున్నారని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. చంద్రబాబు తప్పులను కప్పిపుచ్చుకునేందుకే మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అక్రమ అరెస్ట్‌లతో వైఎస్సార్‌సీపీ నాయకులను ఆపలేరన్నారు. అధికారం శాశ్వతం కాదని ... వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, కచ్చితంగా అక్రమాలకు అన్యాయాలకు చంద్రబాబు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చుక్కలూరు మండిపడ్డారు. ఆదివారం ఆయన పామిడిలో మాట్లాడుతూ కూటమి కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసు బనాయింపు అన్నారు. ఏపీలో సీఎం చంద్రబాబు, లోకేష్ ఆధ్వర్యంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందనడానికి ఎంపీ అక్రమ అరెస్టే తార్కాణమన్నారు. హామీలను నెరవేర్చలేక ఇలాంటి నీచ రాజకీయలాకు పాల్పడుతున్న సీఎం, ఆయన తనయున్ని నమ్మే పరిస్థితిల్లో ప్రజలు లేరన్నారు. కూటమి ప్రభుత్వం 13 నెలల పాలనల్లోనే ప్రజలు విసిగెత్తిపోయారని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయా? తండ్రీ, కొడుకులకు బుద్ధి చెబుతామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అక్రమం

గుత్తి: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు ముమ్మాటికీ అక్రమమేనని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. గుత్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచు పీరా, పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, పట్టణ ప్రచార విభాగం అధ్యక్షుడు వెల్డింగ్ రవూఫ్ మాట్లాడారు. ఇంతవరకూ కూటమి ప్రభుత్వం చేయించిన అరెస్టులన్నీ రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కక్ష సాధింపు రాజకీయాలు, అక్రమ అరెస్టులు మానుకుని పాలన పట్ల దృష్టి సారిస్తే బాగుటుందన్నారు. లేకపోతే ప్రజలే కూటమి ప్రభుత్వానికి, నాయకులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు రంగస్వామి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, కేవీ రమణ, వరదరాజులు, పట్టణ ప్రచార అధ్యక్షులు వెల్డింగ్ రవూఫ్,సునీల్, టౌన్ బ్యాంకు రాము, పులెప్ప, గట్టప్ప, సుధాకర్, చంద్ర, లాలు,రమేష్ రెడ్డి, జీపు రమణ, లక్ష్మన్న, మర్తాడు దాదు, క్రిస్టియన్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు కటిక అన్వర్, నూర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శింగనమల: ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడం సరికాదని జెడ్పీటీసీ నీలం భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పూలప్రసాద్, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మీద కేసులు పెట్టడం, దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ప్రశ్నిస్తున్న వారందరిపై కేసులు పెడుతున్నారన్నారు. కేసులు బనాయించినా వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడరన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులకు సన్మానం



నిట్టూరు రఘునాథ్‌రెడ్డిని అభినందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి



నార్పల సత్యనారాయణరెడ్డిని అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

నార్పల: అనంతపురం పార్లమెంట్‌లో రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నికైన నార్పల సత్యనారాయణరెడ్డి, నిట్టూరు రఘునాథ్‌రెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. నిట్టూరు రఘునాథ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నారై గ్లోబల్ వింగ్ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డితో పాటు ఆయన అభిమానులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అలాగే నార్పల సత్యనారాయణరెడ్డిని ఆతడి అభిమానులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి తన అనుచరులతో సత్యనారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, ఎంపీపీ నాగేశ్వరావు, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో టౌన్ బ్యాంకు

గుత్తి: బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారుల కృషి ఫలితంగా కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు రూ.1.49 కోట్ల లాభాల్లో ఉందని ఆ బ్యాంకు ప్రెసిడెంట్ అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వర ప్రసాద్ తెలిపారు. గుత్తిలోని వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం బ్యాంకు 102వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు విరివిరిగా ఇస్తున్నామన్నారు. వడ్డీ రేట్లు కూడా చాలా తక్కువగా ఉన్నాయన్నారు. త్వరలో కదిరి, డోన్, గుంతకల్లులో టౌన్ బ్యాంకు బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే సోషల్ మీడియాలో బ్యాంకుపై తప్పుడు ప్రచారం చేసిన షెక్షావలి టౌన్ బ్యాంకు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు రాము, డైరెక్టర్లు కృష్ణ, నాగరాజు, అంగడి నాగరాజు, వీరన్న, మాబు, దాదు, వెంకి, మధు తదితరులు పాల్గొన్నారు.

కవి నాగమునికి పురస్కారం



గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకుంటున్న కవి నాగముని

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్, కవి నాగముని ఉర్దూ కవి ఫైజ్ అహ్మద్ సాహితీ సేవా పురస్కారం–2025 అవార్డును దక్కించుకున్నారు. రచయితలు హిందూపురంలో ఆదివారం నిర్వహించిన సాహితీ పురస్కార సభలో సాహితీ రంగంలో విశేష ప్రతిభ కనబరిచి నాగమునికి గజల్ గాయకుడు శ్రీనివాస్ సేవా పురస్కారం అందజేశారు. నాగముని మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

నేడు మండల సమావేశం

యాడికి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జి.ఉమాదేవి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీర్రాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 14పంచాయతీల్లోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలో నూతన 33 కె.వి. విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర, ఏఈ రఘునాథ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వారు కోరారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ కార్యాలయంలో ఈనెల 22న ద్విచక్రవాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంలో పాల్గొనదలిచిన వారు ఆధార్, పాన్‌కార్డ్ జిరాక్స్ కాపీతో హాజరు కావాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని యల్లనూరు రోడ్డు శివారు ప్రాంతంలో ముళ్లపొదల మధ్య పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.39,360 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు అబాకస్ పోటీలు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సత్యసాయి కల్యాణ మండలంలో ఆదివారం ప్రణవ్ అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అబాకస్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 34 మంది విద్యార్థులు పాల్గొనగా నలుగురు చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా, ఏడుగురు చాంపియన్‌లుగా, 12 మంది టాపర్లుగా, 10 మంది విన్నర్‌లుగా, ఒక్కరు రన్నర్‌గా నిలిచినట్లు రుకేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రణవ్ అబాకస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

పామిడి: పట్టణంలోని భావసార క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి ఎస్.తిరుపతినాయుడు సారథ్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో బెంగళూరులోని శంకర ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు అబ్దుల్ అబీద్ 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 70 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు కే రఘువీర్‌రావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, కోశాధికారి డీ షెక్షావలి, జిల్లా చైర్మన్లు డాక్టర్ మురళీకృష్ణ, పీసే జయరాంరావు, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ శాంతిప్రియ, సంయుక్త కార్యదర్శి రోషన్ జమీర్, డైరెక్టర్లు, ఆర్గనైజర్లు, ఆస్పత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి హై స్కూల్ లో ఆదివారం యాడికి లయన్స్ క్లబ్, మై హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఊపిరితిత్తుల మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ధ్రువనారాయణ, డాక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం 66 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మహేంద్ర, నాగరాజు, కాంతమ్మ , పాఠశాల కరస్పాండెంట్ మారుతీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి క్రాస్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురానికి చెందిన గోవిందు, పరమేష్ అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంలో గుత్తికి వచ్చి తిరిగి వెళ్తుండగా తలగాచిపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారును ఢీ కొన్నారు. గాయపడిన వారిని స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నెమలిని కాపాడిన యువకుడు



నెమలిని అధికారులకు అప్పగిస్తున్న రాజేష్

గుత్తి: గుత్తి పట్టణ శివారులోని ఆదివారం కుక్కల బారిన పడిన నెమలిని వెంకటేష్ అనే యువకుడు కాపాడాడు. వివరాలు.. న్యూ సీపీఐ కాలనీకి చెందిన వెంకటేష్ నెమలిని వెంటాడుతున్న కుక్కలను గమనించాడు. కుక్కలను పారద్రోలి నెమలిని కాపాడాడు. వెంటనే నెమలిని ఫారెస్టు అధికారులకు అప్పగించాడు. ఫారెస్టు అధికారులు నెమలిని అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న విరూపాక్షి రెడ్డి కన్వెన్షన్ హాల్లో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం లయన్స్ క్లబ్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, లయన్స్ క్లబ్ ప్రముఖులు ఉపేంద్ర, ప్రతినిధులు విరూపాక్షిరెడ్డి, రుఖియా బేగం, రిలయన్స్ బాషా,వెంకటేశ్వర రెడ్డి, వెంకప్ప, చిన్న, శ్రీకరం రవి, శ్రీనివాస యాదవ్, అమృత్ సినిమా ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తి, గుత్తి ఫోర్ట్, గుత్తి గౌతమి పురి, అనంతపురం ఎలైట్, పామిడి, కనేకల్లు నూతన లయన్స్ క్లబ్ కార్యవర్గాల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

హామీల అమలులో కూటమి విఫలం

పుట్లూరు: హామీల అమలులో కూటమి విఫలమైందని సీపీఐ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ మండల మహాసభలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సమంజసం కాదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు ఎప్పుడు చేస్తారని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా పెద్దయ్య, సహాయ కార్యదర్శులుగా పెద్దిరాజు, బాలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి టి. నారాయణస్వామి, మండల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

తాడిపత్రిరూరల్: జిల్లా కేంద్రంలో ఆగస్టు 12, 13 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు నాయకులు కోరారు. పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఐ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లాలో మహాసభలను ఏర్పాటు చేశామన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలో పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి, సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీర్ల పండుగ



కోమలిలో జలధికి వెళ్తున్న పీర్లు

తాడిపత్రిటౌన్: మండలంలోని కోమలి గ్రామంలో పీర్ల పండుగ ప్రశాంతంగా ముగిసింది. గతంలో పీర్ల పండుగ సందర్భంగా గ్రామస్తులు ఇరువర్గాలుగా విడిపోయి గొడవలకు పాల్పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. అప్పటి నుంచి గ్రామంలో పీర్ల పండుగను నిర్వహించుకోలేదు. అయితే 36 సంవత్సరాల తర్వాత ఇరువర్గాల వినతి మేరకు ఏఎస్పీ రోహిత్ కుమార్‌చౌదరి ప్రత్యేక చొరవతో గ్రామంలో పండుగ నిర్వహించుకోవడానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. ఆదివారం జలధి సందర్భంగా సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు



శింగనమల జెడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన 1997-98 బ్యాచ్ విద్యార్థులు



నార్పల మండలం పప్పూరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శింగనమల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు పెద్దయ్య, నామదేవుడు, లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్, బంగారప్ప ఘనంగా సన్మానించారు.

నార్పల: మండలంలోని బి.పప్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2007–08 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను పూలమాలలు వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.